
సాక్షి నల్లగొండ

శుక్రవారం, 23, ఆగస్టు, 2024



కొర్లపహాడ్ నుంచి..
కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేయతలపెట్టిన ట్రామాకేర్ సెంటర్ పామనగుండ్లకు తరలిపోయింది. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.20 అడుగులు
ఇన్‌ఫ్లో	: 42461 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 45919 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28879 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 6301 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.69 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2562 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 2331 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 216.67 క్యూసెక్కులు
కుడికాల్వకు	:168.52 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నూతన రెవెన్యూ చట్టంపై నేడు చర్చావేదిక

నల్లగొండ: నల్లగొండలోని కలెక్టరేట్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు భూ రికార్డుల క్రమబద్ధీకరణ కోసం ప్రతిపాదించిన ఆర్‌ఓఆర్ ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం–2024 (రికార్డ్స్ ఆఫ్ రైట్స్ చట్టం)పై చర్చావేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చర్చావేదికకు రైతు సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, విశ్రాంత, ప్రస్తుత రెవెన్యూ అధికారులు, భూమి విషయాలపై పనిచేస్తున్న ఎన్‌జీఓలు, ఆసక్తి ఉన్న పౌరులు హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన ఐదు నుంచి 18 సంవత్సరాలలోపు బాలబాలికలకు వ్యక్తిగత విభాగంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ (పీఎంఆర్‌బీపీ)-2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి బి.సక్కుబాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో https-//aw-ar-d-r.gov,in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. నూతన ఆవిష్కరణలు, సోషల్ సర్వీస్, ప్రగతి, క్రీడలు, కళలు సాహిత్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలలకు వ్యక్తిగతంగా బహుమతులు అందజేస్తారని తెలిపారు.

మెప్మా సీఓ సస్పెన్షన్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజింగ్(సీఓ)గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులను జారీ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శ్రీనివాస్ విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రతి పనికి లంచం తీసుకోవడం, సిబ్బందిని వేధించడంతోపాటు అతనిపై లైంగిక ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో జూలైలో జిల్లా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్.. మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌తో కలిసి విచారణ జరిపి కలెక్టర్‌కు అందించారు. నివేదిక ప్రకారం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం నిత్యపూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు స్వయంభూలకు సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం అర్చన, అభిషేకం చేశారు. అలాగే ఆలయ ప్రాకార మండపం, ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు గావించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు.

196 మందికి పదోన్నతి

విద్యుత్ శాఖలో ప్రమోషన్ల కోలాహలం
- కోర్టు కేసులతో 30 నెలలుగా ఆగిన ప్రక్రియ
- ఉద్యోగ సంఘాల హెచ్చరికతో స్పందించిన ప్రభుత్వం
- ఎట్టకేలకు హడ్‌హాక్ పద్ధతిన పదోన్నతులు
- ఆనందంలో విద్యుత్ ఉద్యోగులు



నల్లగొండ: విద్యుత్ శాఖలో పదోన్నతుల కోలాహలం నెలకొంది. విద్యుత్ ఉద్యోగ సంఘాలు ఇచ్చిన అల్టిమేటానికి ప్రభుత్వం ఎట్టకేలకు స్పందించింది. కొన్ని నెలలుగా ఆగిపోయిన పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని నిర్ణయించింది. దీంతో వెంటనే 196 మంది ఉద్యోగులకు తాత్కాలిక (అడ్‌హాక్) పద్ధతిన పదోన్నతులు కల్పించింది. కోర్టు తీర్పు ఆధారంగా తిరిగి పదోన్నతుల ఆర్డర్లు మారుతాయని స్పష్టం చేసింది. దీంతో ఉద్యోగుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

ఉద్యోగ సంఘాల డిమాండ్‌తో..
బీసీ, ఓసీ ఉద్యోగులు మెరిట్ కమ్ సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేయగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు మాత్రం రోస్టర్ కమ్ సీనియారిటీ ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని కోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టులో కేసు విచారణ సాగుతున్నందున విద్యుత్ శాఖ పదోన్నతుల విషయంలో జాప్యం చేసింది. కోర్టు కేసుల కారణంగా 30 మాసాలుగా పదోన్నతులు ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో చాలామంది ఉద్యోగులు పదోన్నతి పొందకుండానే పదవీ విరమణ పొందాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. పదోన్నతులు చేపట్టకపోతే విద్యుత్ సౌదాను ముట్టడిస్తామని విద్యుత్ ఉద్యోగ సంఘాలైన 1104, 237, డిపామా, ఇంజినీర్స్ అసోసియేషన్లు హెచ్చరించాయి. వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశాయి. దీంతో ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిలో పాత విధానాన్ని అనుసరిస్తూ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించింది.

ప్రభుత్వానికి ధన్యవాదాలు



విద్యుత్ ఉద్యోగులకు అడ్‌హాక్ పద్ధతిన పదోన్నతులు కల్పించడం ఆనందంగా ఉంది. కోర్టులో కేసులు ఉన్నప్పటికీ ప్రత్యేక చొరవ తీసుకొని పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు.
– చిమ్మచెట్ల వెంకటయ్య, 1104 సంఘం జిల్లా అధ్యక్షుడు

పదోన్నతులు పొందింది వీరే..

జిల్లా స్థాయిలో..
జేఏఓలుగా ఇద్దరు, ఎస్‌ఏలుగా నలుగురు, ఫోర్‌మెన్‌గా ఏడుగురు, లైన్ ఇన్‌స్పెక్టర్లుగా తొమ్మిది మంది.

డివిజన్ స్థాయిలో..
నల్లగొండ డివిజన్ : లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ఏడుగురు, లైన్‌మెన్‌గా 17 మంది, అసిస్టెంట్ లైన్‌మెన్‌గా 48 మంది.
దేవరకొండ డివిజన్ : లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ముగ్గురు, లైన్‌మెన్‌గా ముగ్గురు, అసిస్టెంట్‌లైన్‌మెన్‌గా 37 మంది.
మిర్యాలగూడ డివిజన్ : లైన్ ఇన్‌స్పెక్టర్లుగా ఎనిమిది మంది. లైన్‌మెన్‌గా 14, అసిస్టెంట్ లైన్‌మెన్‌గా 37 మంది.

'నెల్లికల్లు'కు భూసేకరణ ఆటంకం కారాదు

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నెల్లికల్లు ఎత్తిపోతల పథకానికి భూసేకరణ అడ్డు కాకూడదని నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులతో సంప్రదింపులు జరిపి వచ్చే ఏడాది ఏప్రిల్‌లోగా భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పథకం పురోగతిపై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించి పనులు వేగవంతం చేయాలని కోరారు. అటవీశాఖ భూముల సేకరణకు పరిహారం చెల్లింపుల ప్రతిపాదనలను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. రూ.23 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిల చెల్లింపులకు ప్రతిపాదనలను పంపాలని ఆదేశించారు. నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలో కొత్త చెక్‌డ్యామ్ నిర్మాణానికి పాలనాపరమైన అనుమతుల జారీతో పాటు మొత్తం ఐదు చెక్‌డ్యామ్‌లకు తక్షణమే టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. లోలెవల్ కెనాల్‌లో జంగిల్ కటింగ్ వెంటనే మొదలు పెట్టాలని పేర్కొన్నారు. సాగర్ కాల్వకు మరమ్మతులను మొదలుపెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి, మాజీ మంత్రి కె.జానారెడ్డి, ఈఎన్‌సీ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ సబ్‌కలెక్టర్‌గా నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ: మిర్యాలగూడ సబ్ కలెక్టర్‌గా నారాయణ్ అమిత్ మాలెపాటిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడుగురు సబ్ కలెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేయగా.. 2022 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి నారాయణ్ అమిత్‌ను మిర్యాలగూడకు కేటాయించారు. మిర్యాలగూడ డివిజన్‌కు ఇటీవల సబ్ కలెక్టర్ హోదా కల్పించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆర్డీఓగా ఉన్న శ్రీనివాస్‌ను ఎక్కడికి బదిలీ చేశారనే విషయం తెలియరాలేదు. సబ్ కలెక్టర్‌గా నియమితులైన నారాయణ్ అమిత్ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

త్వరలోనే ఉదయ సముద్రం ఆయకట్టుకు సాగునీరు

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: ఉదయ సముద్రం రిజర్వాయర్ కింద ఆయకట్టు రైతులందరికీ త్వరలోనే సాగునీరు అందిస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆయన ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సాగునీరు వచ్చే ఇన్ పాల్ రెగ్యులేటర్, నీరు బయటకు వెళ్లే ఔట్ పాల్ రెగ్యులటర్లను తనిఖీ చేశారు. అక్కంపల్లి రిజర్వాయర్ హైలెవల్ కెనాల్ ద్వారా ఉదయ సముద్రంలోకి నీరు వస్తుండగా, ఉదయసముద్రం నుంచి డి–39, డి–40 ద్వారా ఆయకట్టు భూములకు నీరు వెళ్లడాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డి–39 కింద 10 వేల ఎకరాలు, డి–40 కింద 27 వేల ఎకరాలు సాగు అవుతుండగా, నీటి మట్టం పెరిగిన తర్వాత కింది భాగంలో ఉన్న అన్ని చెరువులు, కుంటలు నింపాలని అధికారులను ఆదేశించారు. మూసీ రివర్ కింది భాగంలో ఉన్న డి–55 వరకు సాగునీరందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఉదయ సముద్రం ఆయకట్టు రైతులు తొందరపడి నీటిని మళ్లించుకోవద్దన్నారు. ఆయన వెంట ఈఈలు జి.శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రావు, డీఈ ఆనందరావు, ఏఈలు, లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు ఉన్నారు.



ఉదయ సముద్రం రెగ్యులేటర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

దీన్‌దయాళ్ స్పర్శ్ యోజనకు దరఖాస్తులు

రామగిరి(నల్లగొండ): పోస్టల్ స్టాంపుల సేకరణ, అధ్యయనం (ఫిలాటలీ) పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు పోస్టల్ డిపార్ట్‌మెంట్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి దీన్ దయాళ్ స్పర్శ్ యోజనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నల్లగొండ పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ రఘునాథస్వామి తెలిపారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పోస్టల్ కార్యాలయం నిర్వహించే వివిధ స్థాయిల క్విజ్, ఫిలాటలీ ప్రాజెక్టు ఆధారంగా ప్రతి అవార్డు గ్రహీతలకు సంవత్సరానికి రూ.6 వేల స్కాలర్‌షిప్‌ను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సెప్టెంబర్ 12వ తేదీలోపు సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీస్, నల్లగొండ డివిజన్ కార్యాలయానికి దరఖాస్తులను రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేయాలని కోరారు.

రైతులను దగా చేస్తే ఊరుకోం



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

- ఎమ్మెల్సీ కోటిరెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- రైతులందరికీ రుణమాఫీ చేయాలని నల్లగొండలో ధర్నా

నల్లగొండ టూటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దగా చేస్తే ఊరుకోబోమని, ఎన్నికల హామీలో భాగంగా ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండలోని పెద్ద గడియారం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సగం మంది రైతులకు కూడా రూ.2లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. ఏఎమ్మార్పీ కాల్వల ద్వారా నల్లగొండ నియోజకవర్గ రైతులకు సాగునీరివ్వకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతుల కోసం ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్‌వలీ, నాయకులు చీర పంకజ్‌యాదవ్, కటికం సత్తయ్యగౌడ్, మాలె శరణ్యారెడ్డి, మందడి సైదిరెడ్డి, బక్క పిచ్చయ్య, అభిమన్యు శ్రీనివాస్, కరీంపాషా, తండు సైదులుగౌడ్, నాయబోయిన భిక్షం, కంచనపల్లి రవీందర్‌రావు, గాదె రాంరెడ్డి, దోటి శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, మారగోని గణేష్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, అయితగోని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ పేరుతో మోసం

- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ: రుణమాఫీ పేరుతో రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేసిందని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆరోపించారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం దేవరకొండలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆ పార్టీ నాయకులతో కలిసి నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 40 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆ పార్టీ నాయకులు బీల్యానాయక్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరావు, మల్లపురెడ్డి, వెంకటేశ్వరరావు, బాలయ్య, ఆంజనేయులు, జనార్దన్‌రావు, అంజిరెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, గుర్రం సురేష్ పాల్గొన్నారు.



దేవరకొండ : ధర్నాలో పాల్గొన్న రమావత్ రవీంద్రకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు

16.86 లక్షల మందికి వైద్య పరీక్షలు

ముగిసిన ఫీవర్ సర్వే
- 4.30 లక్షల ఇళ్లలో పరిశీలన
- జ్వరపీడితులు 3,226 మంది.. డెంగీ కేసులు 7
- గుర్తించిన వైద్య బృందాలు



కొండమల్లేపల్లిలో ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్ (ఫైల్)

నల్లగొండ టౌన్: సీజన్ వ్యాధులను ఆదిలోనే గుర్తించి కట్టడి చేయాలన్న లక్ష్యంతో కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఇంటింటా ఫీవర్ సర్వే ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 1,556 బృందాలతో చేపట్టిన ఈ సర్వేలో ఏఎన్ఎంలు, ఆశాలు, ఇతర వైద్య సిబ్బంది భాగస్వాములయ్యారు. సర్వే ద్వారా ప్రతి ఇంట్లో ఉన్న సభ్యుల వివరాల సేకరణతో పాటుగా వారు ఏ రుగ్మతలతో బాధపడుతున్నారో తెలుసుకున్నారు. జ్వరం తీవ్రతను బట్టి రక్త పరీక్షలను నిర్వహించారు.

సర్వే వివరాలు

డివిజన్	వైద్య పరీక్షలు	జ్వర పీడితులు	డెంగీ కేసులు
నల్లగొండ	7,14,121	1,455	02
మిర్యాలగూడ	5,47,088	1,192	05
దేవరకొండ	4,25,754	579	00

ఆరు రోజుల పాటు..
జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు వైద్య బృందాలు ఫీవర్ సర్వే చేపట్టాయి. ఈ సర్వే బృందాల సభ్యులు 4,30,632 ఇళ్లను సందర్శించి 16,86,963 మందిని పరీక్షించారు. అందులో 3,226 మంది తీవ్రమైన జర్వంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారిలో జ్వరం తీవ్రతను బట్టి 1,688 మందికి డెంగీ పరీక్షలను నిర్వహించగా అందులో 7 డెంగీ పాజిటివ్ కేసులుగా తేలాయి. వారిని చికిత్స కోసం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు తెలిసింది. జ్వరంతో బాధపడుతున్న వారికి మందులు అందిస్తున్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టేందుకు..
ముఖ్యంగా దోమల వ్యాప్తిని అరికట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం ఈ సర్వే చేపట్టింది. వైద్య బృందాల సభ్యులు ఫీవర్ సర్వే చేస్తూనే మురుగు కాలువలు, గుంటల్లో నీరు నిల్వకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో ఆయా గ్రామ పంచాయతీల సిబ్బందిని సమన్వయం చేస్తూ తొట్లు, నీటి కుండ, గోళాలు, కొబ్బరి చిప్పలు, పూలతొట్లలో నీటి నిల్వలు ఉండకుడా పారబోయించారు. మురుగు నీటిలోనే దోమలు గుండ్లు పెట్టి అవి మరింతగా వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించారు. ఇంటి పరిసరాలతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని చైతన్య పర్చారు. జర్వ లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సర్వే బృందాలు సూచించాయి.

ప్రతి ఇంట్లో సర్వే చేపట్టాం
ప్రతి ఇంటికి వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాం. కుటుంబ సభ్యులందరి పరిస్థితిని అడిగి తెలుసుకున్నాం. జ్వర పీడితులు ఉంటే వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించాం. ముఖ్యంగా దోమల వ్యాప్తిని నియంత్రించేలా ప్రజలకు అవగాహన కల్పించాం
– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ, నల్లగొండ

పోటాపోటీ కార్యక్రమాలతో రైతు ధర్నా ఉద్రిక్తత

రుణమాఫీ పై తిరుమలగిరి, ఆలేరులో బీఆర్‌ఎస్ చేపట్టిన రైతు ధర్నాలు ఉద్రిక్తతకు దారితీశాయి. తిరుమలగిరిలో బీఆర్‌ఎస్‌కు కౌంటర్‌గా కాంగ్రెస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం, ఆ తరువాత బీఆర్‌ఎస్ ధర్నా శిబిరం వద్దకు వెళ్లడంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. ఇక ఆలేరుకు వచ్చిన మాజీ మంత్రి హరీష్‌రావు.. రుణమాఫీపై సీఎం మాట తప్పారని యాదాద్రిలో పాప ప్రక్షాళన పూజ చేయించగా అభ్యంతరం వ్యక్తం చేస్తూ దేవస్థానం ఈఓ. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు సైతం కాంగ్రెస్ నేతలపై ఫిర్యాదు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు యాదాద్రిని అపవిత్రం చేశారంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆలయాన్ని శుద్ధి చేశారు. అలాగే ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ రైతు ధర్నాలు కొనసాగాయి.

- తిరుమలగిరిలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఘర్షణ
- రాళ్లు, కోడిగుడ్లు విసురుకున్న ఇరువర్గాలు
- యాదాద్రిలో హరీష్‌రావు పాప ప్రక్షాళన
- ఈఓ అభ్యంతరం.. పోలీసులకు ఫిర్యాదు
- ఆలయాన్ని శుద్ధి చేసిన బీర్ల అయిలయ్య

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పరస్పరం దాడులు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరిలో గురువారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. పరస్పరం రాళ్లు, కోడిగుడ్లు, టమాటలతో దాడులు చేసుకునే పరిస్థితి వచ్చింది. అసలేమైందంటే.. ఎలాంటిషరతులు లేకుండా అర్హులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ పిలుపునిచ్చింది. ఈనేపథ్యంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నేతృత్వంలో తిరుమలగిరి ఎక్స్‌రోడ్డులోని మోత్కూరువెళ్లే మార్గంలో టెంట్‌వేసి ధర్నాకు దిగారు. ఈ ధర్నాకు పోటీగానే కాంగ్రెస్ శ్రేణులు కూడా రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల రుణమాఫీని చేసినందుకు హర్షిస్తూ ఎక్స్‌రోడ్డులోని మహాత్మా పూలే విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆ సమయంలో ధర్నాలో గాదరి కిషోర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు సీఎంకు అనుకూలంగా నినాదాలు చేస్తూ బీఆర్‌ఎస్ శిబిరంపైకి వెళ్లడానికి మూకుమ్మడిగా ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ దశలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. కోడిగుడ్లు, రాళ్లు, టమాటలు, టపాసులు విసురుకున్నారు. పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఈ దాడుల్లో ఇరు పార్టీలకు చెందిన ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. రెండు కార్లు ధ్వంసం అయ్యాయి. ఇరువర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్

పాప ప్రక్షాళన పూజలు.. ఆలయ శుద్ధి

సాక్షి, యాదాద్రి : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు జిల్లా పర్యటన నేపథ్యంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆలేరులో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన రైతు ధర్నాలో పాల్గొనడానికి హరీష్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, స్థానిక నాయకులతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఆగస్టు15లోగా రైతులందరికీ రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి లక్ష్మీ నర్సింహస్వామి మీద ఒట్టుపెట్టి మాట తప్పారని స్వామి సమక్షంలో ప్రైవేట్ అర్చకుడితో ఆలయ మాడవీధుల్లో పాప ప్రక్షాళన పూజ చేయించారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాట ప్రకారం గడువులోపు రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా మాటతప్పడం వల్లే యాదాద్రిలో పాప ప్రక్షాళన పూజ చేయించినట్లు హరీష్‌రావు పేర్కొన్నారు. పాలకుడు పాపం చేస్తే ప్రజలకు అరిష్టమని, అందుకే ప్రజలకు పాపం కలగవద్దని, సీఎంను క్షమించాలని స్వామివారికి మొక్కుకున్నట్లు తెలిపారు.



ఆలేరులో జరిగిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, భిక్షమయ్యగౌడ్, నాయకులు

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు

ఆలయ మాడవీధుల్లో బీఆర్‌ఎస్ నేతలు సంకల్పం చేయడంపై దేవస్థానం ఈఓ భాస్కర్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రైవేట్ అర్చకుడితో బీఆర్‌ఎస్ నాయకులు ఆలయ మాడవీధుల్లో పూజలు చేశారని, దేవాదాయ శాఖ సెక్షన్–7 ప్రకారం ఆలయ ప్రాంగణంలో రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడం నిషేధమని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అనుమతి లేకుండా ఆలయాన్ని శుద్ధి చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారంటూ ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులపై దేవాదాయశాఖ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని గుట్ట పోలీస్‌స్టేషన్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దల ప్రోద్బలం, రాజకీయ కుట్రతోనే బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. ప్రజలు బాగుండాలని పూజలు చేస్తే కేసులు పెడతారా? అని ధ్వజమెత్తారు. తమ పార్టీ నాయకులపై కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

నేడు అంతరిక్ష దినోత్సవం నిర్వహించాలి

నల్లగొండ: అన్ని పాఠశాలల్లో శుక్రవారం జాతీయ అంతంక్ష దినోత్సవాన్ని జరుపుకోవాలని డీఈఓ భిక్షపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఆగస్టు 23న చంద్రయాన్–3 మిషన్ చంద్రుని దక్షిణ ధృవంలోని శివశక్తి పాయింట్‌లో విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా చేరిన సందర్భంగా అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంకేతిక ప్రదర్శనలు, ఇస్రో అంతరిక్ష విజయాలు, క్విజ్ పోటీలు, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించాలని తెలిపారు. నిర్వహించిన కార్యకలాపాల సమాచారాన్ని ఫొటోలు, వీడియోలు, నివేదికలుగా ఈ నెల 24 పంపించాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి 984 8578845 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భువనగిరి ఆస్పత్రిలో ప్రపంచ బ్యాంకు బృందం

భువనగిరి : గ్లోబల్ ప్రాక్టీస్ ఫర్ హెల్త్, న్యూట్రిషన్ పాపులేషన్, సౌత్ ఏషియా ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గురువారం జిల్లా కేంద్ర ఆస్పత్రిని, తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను సందర్శించింది. డయాగ్నోస్టిక్ సెంటర్‌లోని పరికరాలు, వైద్య పరీక్షలు చేసే యంత్రాలు, పీహెచ్‌సీల నుంచి వస్తున్న రక్త నమూనాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, రక్త పరీక్షల రిపోర్టు రోగులకు చేరే విధానంపై ఆరా తీశారు. రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఆస్పత్రిలో అందుతున్న వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. మెడికల్ కళాశాల వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

క్లుప్తంగా

ఎంజీయూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గురువారం ఐటీ, నాన్ ఐటీ అభ్యర్థుల కోసం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. మొత్తం 170 మంది అభ్యర్థులు పాల్గొనగా 70 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శ్రాంతి తెలిపారు. డిగ్రీ, పీజీ, బీటెక్ అభ్యర్థుల కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు శివప్రసాద్, నవీన్, భరత్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యకులపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అసోం రాష్ట్రానికి చెందిన ఓ మహిళ (27) భర్తతో కలిసి హైదరాబాద్‌లోని శంకర్‌పేటలో ఉంటున్నారు. భర్తతో గొడవ పడి పదేళ్ల కూతురితో కలిసి అసోం వెళ్లడానికి బుధవారం రాత్రి శంకర్‌పేట బస్టాండ్ వద్ద వేచి ఉంది. సికింద్రాబాద్ వెళ్లాలని ఆటోను ఆపి అందులో ఎక్కింది. ఈ క్రమంలో ఆటోలో ఉన్న వ్యక్తులు ఆమెను మాటల్లోకి దించి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం సమీపంలోకి తీసుకువచ్చారు. మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె కేకలు వేసింది. దీంతో పక్కనే ఉన్న బీపీసీఎల్ కంపెనీ సెక్యూరిటీ 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లేలోపు నిందితులు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

విద్యుత్ కాపర్ వైర్ చోరీ



అడవిదేవులపల్లి : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన అడవిదేవులపల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. అడవిదేవులపల్లి మండలం బంగారుకుంట తండా గ్రామ పంచాయతీ పరిధిలోగల వ్యవసాయ భూమిలో 25 కేవీ సామర్థ్యం గల రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వంసం చేశారు. అందులో కాపర్(రాగి) వైర్, ఆయిల్‌తోపాటు ఇతర విడి భాగాలను దొంగిలించారు. ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి శ్రీని వా స్‌నాయక్‌తో పాటు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు బంగారునాయక్ పేర్కొన్నారు.



కొర్లపహాడ్ నుంచి పామనగుండ్లకు ట్రామాకేర్ సెంటర్

- గత నెలలో శంకుస్థాపన చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నిర్మాణ పనులకు అనుమతులు నిరాకరించిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు
- తాజాగా పామనగుండ్లలో స్థలం గుర్తింపు

కేతేపల్లి: హైదరాబాద్– విజయవాడ 65 నంబర్ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేయనున్న ప్రతిష్ఠాత్మక ట్రామాకేర్ సెంటర్ ప్రాజెక్టు మరోచోటుకు తరలిపోయింది. ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు అనుమతులు నిరాకరించడంతో నిర్మాణ సంస్థ, అధికారులు సెంటర్‌ను మరోచోట ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జాతీయ రహదారిపై నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించి సాధ్యమైనంత మేర మరణాలను తగ్గించాలనే లక్ష్యంతో ఏడీపీ (ఆటోమెటిక్ డాటాబేస్ ప్రాసెస్) అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద రూ.5కోట్ల వ్యయంతో అత్యాధునిక వసతులతో కూడిన ట్రామాకేర్ సెంటర్‌ను ప్రారంభించాలని ప్రతిపాదించింది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే కొర్లపహాడ్ టోల్‌ప్లాజాను కీలక జంక్షన్‌గా గుర్తించిన ఏడీపీ సంస్థ ఇక్కడ గల అరెకరం స్థలంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సెంటర్ భవన నిర్మాణానికి గత జూలై 8న రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లోనే భవనం పూర్తి చేయాలనే లక్ష్యంతో శంకుస్థాపన జరిగిన మరుసటి రోజు నుంచి కాంట్రాక్టు సిబ్బంది నిర్మాణ పనులు ప్రారంభించారు. పనులు ప్రారంభమైన నెల రోజుల తర్వాత ఇక్కడ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు ఎన్‌హెచ్‌ఏఐ అనుమతులు నిరాకరించింది. 2010లో హైవేను నాలుగు లేన్లుగా విస్తరించిన సమయంలో ప్రభుత్వం రైతుల నుంచి సేకరించి ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగించిన భూమిని ఇతర సంస్థల కార్యకలాపాల నిర్వహణకు బదలాయించేది లేదని, తక్షణమే సెంటర్ నిర్మాణ పనులు నిలిపివేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు నోటీసులు జారీ చేసింది. దీంతో పనులు నిలిపివేసిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు.. ఇప్పటి వరకు చేసిన నిర్మాణాలను కూల్చి వేశారు. యంత్ర సామగ్రి, సిబ్బందిని అక్కడి నుంచి తరలించారు. హైవే వెంట మరో చోట ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు కట్టంగూర్ మండలంలోని పామనగుండ్ల వద్ద మూడెకరాల ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించారు. ఆ ప్రాంతంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు గల సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటవుతుందని సంతోషించిన కేతేపల్లి ప్రజలు.. సెంటర్ ఇక్కడి నుంచి తరలిపోవడంతో నిరాశకు గురయ్యారు.



కొర్లపహాడ్ సమీపంలో సామగ్రి తరలించగా ఖాళీగా దర్శనమిస్తున్న స్థలం



ట్రామాకేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి (ఫైల్)

ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే సహించం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి : రసాయన కంపెనీలు నిబంధనలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే సహించేది లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఉమ్మడి నల్లగొండ పీసీబీ ఈఈ సంగీత, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి భూదాన్‌పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెంలో గల ఆప్టిమస్, వీజె సాయి కెమ్, హెజెలో ల్యాబ్ కంపెనీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కంపెనీల్లో తయారవుతున్న ప్రొడక్ట్, విభాగాలు, వ్యర్థ రసాయనాలను శుద్ధి చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్లను పరిశీలించారు. అలాగే రసాయన కంపెనీల వల్ల స్థానిక రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కాగా కంపెనీలు నిబంధనలు పాటించకపోవడం వల్ల నీటి, వాయి కాలుష్యంతో పంటలు పండించుకోలేకపోతున్నామని, పాడి, ఫౌల్ట్రీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపిస్తోందని రైతులు వారి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ.. నీరు, గాలి, నేల కాలుష్యం కాకుండా చూడాల్సిన బాధ్యత కంపెనీలపై ఉందన్నారు. పీసీబీ అధికారులు సరిగ్గా మానిటరింగ్ చేయాలని, నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దోతిగూడెంలో రసాయన కంపెనీలు నిబంధనలు పాటించకుండా వ్యర్థ రసాయనాలను మూసీలోకి వదులుతుండడంతో భూగర్భ జలాలు, గాలి కాలుష్యం, నేల కాలుష్యమై ఇక్కడి ప్రజలు బతకలేని పరిస్థితి నెలకొందన్నారు. కాలుష్యం లేకుండా ట్రీట్‌మెంట్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని నిర్వహించుకుంటే ప్రభుత్వానికి అభ్యంతరం లేదన్నారు. వారివెంట తహసీల్దార్ శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్, డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్ రెడ్డి, నాయకులు భారత లవకుమార్, గునిగంటి రమేశ్, గోరంటి శ్రీనివాస్‌రెడ్డి, బండారు ప్రకాశ్‌రెడ్డి, బాలెం మల్లేశ్, గుర్రం సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆప్టిమస్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీ చామల, ఎమ్మెల్యే కుంభం, కలెక్టర్

పులిచింతలలో ఒక గేటు ద్వారా నీటి విడుదల

హుజూర్‌నగర్ : పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో గురువారం 26,347 క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో ఒక క్రస్ట్ గేటు 2 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 17,611 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16 వేల కూసెక్కులను దిగువన ప్రకాశం బ్యారేజీకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 45.30 టీఎంసీల నీరు ఉంది. పూర్తి రిజర్వాయర్ నీటి మట్టం 53.32 మీటర్లు కాగా ప్రస్తుతం 53.31 మీటర్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 174.93 అడుగుల వరకు నీరు ఉంది.

104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. గురువారం ఈ కేంద్రంలో నాలుగు యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 104 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణ గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు ప్రాజెక్టు ఎస్ఈ దేశ్యానాయక్ తెలిపారు.



దిగువకు విడుదల చేస్తున్న నీరు

ఇంటర్‌లో ప్రవేశాలకు 24న స్పాట్ అడ్మిషన్లు

నల్లగొండ: చెర్వుగట్టులో నిర్వహిస్తున్న నకిరేకల్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో మిగిలిన సీట్లకు ఈ నెల 24న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మధుకర్ గురువారం తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అడ్మిషన్లు పొందాలనుకునే విద్యార్థులు 2024 మార్చిలో రాసిన పదో తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం అర్బన్‌లో రూ.రెండు లక్షల, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల వరకు ఉండాలన్నారు. ఉమ్మడి నలగొండ జిల్లా పరిధిలోని అర్హత కలిగిన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండు డీసీఎంలు ఢీ.. ఒకరు మృతి

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన గురువారం తెల్లవారుజామున మిర్యాలగూడ మండలంలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ కె.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణానికి చెందిన ఎస్‌కె జానీపాష (37) మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన సీహెచ్ వెంకన్న వద్ద సంవత్సర కాలంగా డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో డీసీఎం వాహనంలో టమాటా లోడ్ చేసుకున్నాడు. హాలియా మీదుగా మిర్యాలగూడకు వస్తుండగా తెల్లవారుజామున గం. 3:30 నిమిషాలకు మిర్యాలగూడ మండలం తుంగపాడు వద్దకు చేరుకునేసరికి.. ముందుగా వెళ్తున్న మరో డీసీఎం డ్రైవర్ స్పీడ్ బ్రేకర్‌ను చూసి ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వస్తున్న డీసీఎం ఢీ కొట్టింది. దీంతో వెనుక డీసీఎంలో ఉన్న డ్రైవర్ జానీపాషకు రెండు కాళ్లు విరగడంతోపాటు ఛాతికి క్యాబిన్ బలంగా గుద్దుకుంది. గాయపడిన జానీపాషను 108 సహకారంతో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం స్థానిక అపోలో రీచ్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన మరో డీసీఎం డ్రైవర్ ఖాజా షరీఫ్ వనపర్తి పట్టణానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతుడి భార్య ఎస్‌కె ఆరీఫా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



మృతి చెందిన ఎస్‌కె జానీపాష

బత్తాయి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

గుర్రంపోడు : తిరుపతి యూనివర్సిటీ అందించిన అంటు మొక్కలు నాటిన తోటల్లో నాణ్యతాలోపాలు పరిశీలించేందుకు నాగ్‌పూర్ శాస్త్రవేత్తల బృందం గురువారం గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామంలో గల బత్తాయి తోటలను పరిశీలించారు. తిరుపతి యూనివర్సిటీ రంగాపూర్ బత్తాయి అంటు మొక్కల్లో నాణ్యత లోపించి నష్టపోయామని పలువురు రైతులు ఇటీవల ఉద్యానవన కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నాగపూర్ శాస్త్రవేత్తల బృందం మూడు రోజుల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బాధిత రైతుల తోటలను పరిశీలించి వివరాలు సేకరించింది. బత్తాయి కాయ సైజు తగ్గిపోవడంతోపాటు, క్షీణించిపోవడం, పక్వానికి రాకముందే రాలిపోతున్నాయని రైతులు శాస్త్రవేత్తలకు వివరించారు. అంటు మొక్కల నాణ్యతను డీఎస్‌ఏ పరీక్షల ద్వారా తేల్చాలని శాస్త్రవేత్తలను కోరారు. రైతులు సాగు చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్న శాస్త్రవేత్తలు.. కొత్తగా కొన్ని రకాల బ్యాక్టీరియాల ద్వారా తెగుళ్లు సోకుతున్నట్లు గుర్తించామన్నారు. యూనివర్సిటీ ల్యాబ్‌లలో పరిశీలించి నివారణ మందులు సూచిస్తామన్నారు. బత్తాయి మొక్కల ఆకులు, కాయలు, మట్టిని శాస్త్రవేత్తలు సేకరించారు. నాగ్‌పూర్ యూనివర్సిటీలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తర్వాత లోపాల కారణాలను నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించడంతోపాటు రైతులకు సరైన దిశా నిర్దేశం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగపూర్ ఉద్యానవన శాస్త్రవేత్తలు డాక్టర్ దర్శన్ కడెం, నరేష్, తిరుగునాన్నావెల్, కిరణ్‌కుమార్, వెంకట్, రమేష్, సురేష్ కుమార్, జాయింట్ డైరెక్టర్ బాబు, జిల్లా ఉద్యానవన అధికారి సాయిబాబా, హాలియా, నకిరేకల్ ఉద్యానవన శాఖ అధికారులు మురళి, అనంతరెడ్డి, రైతులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, వేణు, రఘుమోహన్‌రెడ్డి, కేసాని అనంతరెడ్డి, చింతరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిట్టలగూడెంలో రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న శాస్త్రవేత్తలు

పర్యాటకులను ఆకర్షించేలా 'సాగర్' అభివృద్ధి

- తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి
- నాగార్జునసాగర్‌లో పలు ప్రదేశాల పరిశీలన
- చాకలిగట్టు, ఏలేశ్వరం ఎకో, టెంపుల్ టూరిజం అభివృద్ధికి ప్రతిపాదనలు

నాగార్జునసాగర్: బుద్ధవనంతోపాటు నాగార్జునసాగర్ జలాశయ తీరంలో ప్రపంచ దేశాల పర్యాటకులను ఆకర్షించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో ఏకో, టెంపుల్ పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. టూరిజం మాజీ సీఎండీ, మార్గదర్శకులు(మెంటర్)చెన్నూరి ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో టూరిజం, యువజన సర్వీసులు, సాంస్కృతిక, రాష్ట్ర పురావస్తు శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణిప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ ఈలా త్రిపాఠి, బుద్ధవనం కన్సల్టెంట్, చారిత్రక పరిశోధకుడు ఈమని నాగిరెడ్డి, రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్లు నారాయణ, నాగరాజు, తెలంగాణ టూరిజం చీఫ్ ఇంజనీర్ వెంకటరమణ, టూరిజం హోటల్స్ జనరల్ మేనేజర్ నాదన్, టూరిజం వాటర్ ఫ్లూయిట్ జనరల్ మేనేజర్ ఇబ్రాహీం, బుద్ధవనం ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి, ఎఫ్‌డీఓ సంగీతలతో కలిసి లాంచీలో జలాశయం మధ్యలో 415 ఎకరాల్లో ఉన్న చాకలిగట్టుకు వెళ్లారు. ఐలాండ్‌గా ఉన్న దీనిపై అటవీశాఖతో కలిపి ఏకోటూరిజం అభివృద్ధికి గల అవకాశాలపై చర్చించారు. బోటింగ్, వాటర్ స్పోర్ట్స్, క్యాంపింగ్, రిసార్ట్స్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు వారు తెలిపారు. అటవీ శాఖ ఉన్నతాధికారులతో కలిసి త్వరలో సర్వే నిర్వహించి, రెండు శాఖల సమన్వయంతో పర్యాటకంగా అభివృద్ధికి ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏలేశ్వరంపై ఉన్న శివాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రతిపాదనలు తయారు చేసేందుకు సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బుద్ధవనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. బుద్ధవనంపై ఈమని నాగిరెడ్డి వారికి వివరించారు. బుద్ధవనంలో ధ్యానవనం కాంపోనెట్స్, మిగిలిపోయిన పనులు చేసేందుకు ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించేందుకు ప్రతిపాదనలు తయారు చేయనున్నట్లు తెలిపారు. బుద్ధవనాన్ని త్వరలోనే సీసీ కెమెరాల పర్యవేక్షణలోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. వీరి వెంట బుద్ధవన డిజైనర్ శ్యాంసుందర్ రావు, ఏఈ నజీష్, విజయవిహార్ మేనేజర్ కిరణ్‌కుమార్, లాంచీ యూనిట్ మేనేజర్ హరి ఉన్నారు.



చాకలిగట్టుపై చెన్నూరి ఆంజనేయరెడ్డితో చర్చిస్తున్న పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ

బేసిక్ కంప్యూటర్స్‌లో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి : యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ఆధ్వర్యంలో 3 నెలల కాలపరిమితి గల బేసిక్ కంప్యూటర్స్(డేటా ఎంట్రీ ఆపరేటర్) కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. చదువు మధ్యలో మానేసిన వారు అర్హులు కాదని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ ఫొటోలతో సెప్టెంబర్ 9న సంస్థలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు నేరుగా హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజనంతో కూడిన హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తరువాత తప్పనిసరిగా ఉద్యోగం కూడా కల్పిస్తామని వివరించారు. 9133908000, 9133908111, 9133908222 నంబర్లను సంప్రందించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ కాంగ్రెస్ కార్యకర్త మృతి

మిర్యాలగూడ అర్బన్: బోనాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఉంచకుండా అవమానపరిచారని మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాలు.. ఈ నెల 17న రాత్రి మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తేజావత్ భగవాన్‌నాయక్(42) ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడికి కుటుంబ సభ్యులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఐదురోజులుగా మృత్యువుతో పోరాడుతున్న భగవాన్‌నాయక్ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..

చింతపల్లి: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గురువారం చింతపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం..పోలేపల్లి రామ్‌నగర్ వద్ద పది రోజుల నుంచి భిక్షాటన చేసుకుంటూ ఒక వ్యక్తి జీవనం సాగిస్తున్నాడు. ఆ వ్యక్తి మూడు రోజుల క్రితం మృతి చెందాడు. గ్రామస్తులు గురువారం ఆలస్యంగా గుర్తించి పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కు సమాచారం అందించారు. ప్రదీప్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వయసు సుమారు 65 నుంచి 70 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోమాలోకి వెళ్లిన వ్యక్తి మృతి

మిర్యాలగూడ అర్బన్: కోమాలోకి వెళ్లిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడెంలో గల వంశీ టైర్ రీట్రేడింగ్ కంపెనీలో హౌజింగ్ బోర్డుకు చెందిన వేల్పుల గోపయ్య(53) కొంత కాలంగా పని చేస్తున్నాడు. పనికి ఆలస్యంగా వచ్చాడని ఆగ్రహంతో జూన్ 29వ తేదీన కంపెనీ యజమాని అలుగుబెల్లి రాఘవరెడ్డి కర్రతో గోపయ్యపై దాడి చేశాడు. ఈ సంఘటనలో గోపయ్య తలకు బలమైన గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గోపయ్య గురువారం మృతి చెందాడు. మృతుడి బంధువులు కంపెనీ యజమానిపై చర్యలు తీసుకోవాలని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం మత్తులో పోలీసులపై దాడి


త్రిపురారం : పూటుగా మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై వస్తూ పోలీసులపై దాడి చేసి హల్‌చల్ చేసిన సంఘటన త్రిపురారం మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం పోలీస్ స్టేషన్ పరిధి బాబుసాయిపేట రోడ్డులో తెలంగాణ మోడల్ స్కూల్ సమీపంలో గురువారం త్రిపురారం పోలీసులు వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురం గ్రామానికి చెందిన మల్లికంటి వెంకటయ్య, మంగమ్మ, జనార్దన్‌లు నిడమనూరు మండలంలోని ముకుందాపురంలో బంధువుల కార్యానికి వెళ్లి బాబుసాయిపేట రోడ్డులో చిల్లాపురంకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అప్పటికే ముగ్గురు వ్యక్తులు పూటుగా మద్యం సేవించి ఉన్నారు. పోలీసులు వారి ద్విచక్ర వాహనాన్ని నిలపగా అందులో ఒకరు కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని దాడి చేయడానికి ప్రయత్నించారు. వెంటనే పక్కనే ఉన్న పోలీస్ సిబ్బంది.. వారిని పోలీస్ వాహనం ఎక్కాలని చెప్పడంతో గంట సేపు రోడ్డుపై హంగామా సృష్టించారు. ఇదే విషయాన్ని సదరు పోలీస్ సిబ్బంది ఎస్ఐ వీరశేఖర్‌కు ఫోన్‌లో వివరించారు. స్థానికుల సహాయంతో మంగమ్మ, జనార్దన్‌లను పోలీస్ వాహనంలో స్టేషన్‌కు తరలించారు. మంగమ్మ ఆమె కుమారుడు జనార్దన్.. పోలీసుల విధులకు ఆటకం కలిగించడంతో కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వీరశేఖర్ తెలిపారు.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

కట్టంగూర్ : తాళం వేసిన ఇళ్లల్లో రాత్రిపూట దొంగతనాలకు పాల్పడిన దొంగ(పాత నేరస్తుడు)ను గురువారం కట్టంగూర్ పోలీస్‌లు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రికొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణం గణేశ్ టెంపుల్ గ్రామానికి చెందిన షేక్ ఇర్ఫాన్ రాత్రి సమయాల్లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసి ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలు, డబ్బును దొంగిలించేవాడు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఇర్ఫాన్‌పై 15 క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2022 సంవత్సరంలో కొత్తగూడెం 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పీడీ యాక్ట్ కింద పోలీసులు కేసు నమోదు చేయడంతో సంవత్సరం పాటు చర్లపల్లి జైలులో శిక్ష అనుభవించాడు. ఇర్ఫాన్ ఆగస్టు 2, 2024న అబ్రారుద్దీన్‌కు చెందిన ద్విచక్ర వాహనం తీసుకొని నకిరేకల్ పట్టణంలో ఫ్లై ఓవర్ కింద హెయిర్ కటింగ్ షాప్ తాళం పగులగొట్టి రూ.12వేలు దొంగలించాడు. అదేవిధంగా అయిటిపాముల గ్రామంలో ఓ ఇంటి తాళం పగులగొట్టి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, వెండి పట్టీలు, పావు తులం నల్లపూసల గొలుసు, రూ.3వేల నగదు దొంగిలించాడు. ఆ వస్తువుల్లో రెండు చిన్న బంగారు ఉంగరాలు, 16 తులాల వెండి పట్టీలు, రూ.రెండు వేలను షేక్ అబ్రారుద్దీన్‌కు ఇచ్చాడు. గురువారం నల్లగొండ క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇర్ఫాన్ పట్టుబడినట్లు ఎస్ఐ ఎన్ శ్రీను తెలిపారు. నేరస్తుడి నుంచి రెండు తులాల బంగారు నెక్లెస్, తులం చెవి దిద్దులు, మాటీలు, పావు తులం నల్లపూసల గొలుసు, రూ.మూడు వేలు, రెండు సెల్‌ఫోన్లు, ఇనుపరాడ్లు, ఇనుప కత్తెర స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం అబ్రారుద్దీన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మూసీ ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తివేత

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. దీంతో అధికారులు గురువారం ప్రాజెక్టు మూడు గేట్లు పైకెత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. గురువారం సాయంత్రం వరకు మూసీకి ఎగువ ప్రాంతాల నుండి 2,562 క్యూసెక్కుల నీరు వస్తుండగా అధికారులు ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్లను ఒక అడుగు మేర పైకెత్తి 1,945 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.69 అడుగులు ఉంది. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.12 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.




దిగువకు పోతున్న నీరు

కోదాడ రూరల్ ఎస్ఐపై ఎస్పీకి ఫిర్యాదు

కోదాడరూరల్ : మండల పరిధిలోని కూచిపూడిలో పలు కేసుల్లో రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామానికి చెందిన శెట్టి సురేష్‌తోపాటు మరికొందరు గురువారం ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో అయ్యప్ప మాలధారులు నిర్మించుకున్న గోశాల కూల్చివేసిన వారిపై స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారిపై కేసు నమోదు చేయకుండా తమనే సంబంధిత భూ పత్రాలు తీసుకురావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతోపాటుగా గ్రామానికి చెందిన మహిళను వేధించిన కేసులో సదురు వ్యక్తిపై కేసు నమోదు చేయకుండా ఇద్దరిపై కేసు పెట్టాల్సి ఉంటుందని తమను బెదిరించారని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో శెట్టి చంద్రయ్య, శెట్టి రమేష్, పలువురు గ్రామస్తులు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ అనిల్‌రెడ్డిని వివరణ కోరగా.. కూచిపూడి గ్రామంలో జరిగిన సంఘటనలో ఎవరిని ఇబ్బందులు పెట్టలేదన్నారు. సామాన్య ప్రజలకు న్యాయం చేసే విధంగా విధులు నిర్వహిస్తున్న తనపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు.

నాడు పశువుల కాపరి.. నేడు డాక్టరేట్



కత్తి వీరయ్య

మునగాల : పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు విజయరాఘవపురంకు చెందిన ఓ యువకుడు. నాడు పశువుల కాపరిగా ఉన్న ఆ యువకుడు నేడు డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. వివరాలు.. మునగాల మండలం విజయరాఘవపురం గ్రామంలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన కత్తి చంద్రయ్య–ముత్తమ్మ దంపతుల కుమారుడు కత్తి వీరయ్య బడికి వెళ్లే సమయంలో పదేళ్ల పాటు పశువుల కాపరిగా ఉంటూ తన అన్న ప్రోద్బలంతో మూడో తరగతిలో చేరాడు. ఒకవైపు చదువు కొనసాగిస్తూ మరోవైపు ఉద్యమాల్లో పాల్గొంటూ డిగ్రీ పూర్తి చేశాడు. ఈ తర్వాత వివాహమైంది. కొన్నాళ్లు ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. తిరిగి తన చదువును ప్రారంభించిన వీరయ్య.. పీజీ పూర్తిచేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో జాగ్రఫీ నుంచి ప్రొఫెసర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో 'అప్లికేషన్ ఆఫ్ జి.ఐ.ఎస్ అర్బన్ ల్యాండ్ యూజ్ చేంజెస్ ఇన్ సూర్యాపేట మున్సిపల్ ఏరియా'అనే అంశంపై ఇటీవల డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. కత్తి వీరయ్యను పలువురు అభినందించారు.